

# ఏకాకి

యజ్జంశెట్టి శాయి

'పోస్ట్' అన్న కేక వినిపించి, నేను లేచేలోపలే, చలపతి పరుగుతో బయటకు వెళ్ళి రెండు కవర్లు తీసుకు వచ్చాడు. గడపలోనే వ్రాసిన వారి చిరునామా చదువుకొన్నాడు. అతని మొఖంలో వెలుగు స్పష్టంగా కనిపిస్తోంది.

'ఇది విశాఖపట్నం నుంచి — మీ అక్కయ్యగారు వ్రాశారండీ! మరి ఇదేమో! ...మీరు చెప్పుకోండి చూద్దాం! ఎవరు వ్రాశారో?...'

నాకు కొంచెంగా నవ్వు వచ్చింది. కవరు మీద ముత్యాల్లాంటి అక్షరాలు ముందే చూశాను. అది రత్న వ్రాసిన ఉత్తరం. రత్న నాకు కాబోయే భార్య అని చలపతికి తెలుసు.

'అది రత్న వ్రాసిన ఉత్తరం చలపతీ!' అన్నాను నవ్వుతూ.

అతని కళ్ళు ఆశ్చర్యం ప్రకటించినయి.

'మీరు చాలా అసాధ్యులుసార్! మీకు బోలెడు మంది ఉత్తరాలు వ్రాసే వాళ్ళుండగా ఠకీమని ఎలా చెప్పేశారు?...'

రెండు కవర్లూ అందుకొని అక్కయ్య వ్రాసిన ఉత్తరం చింపాను. చలపతి నా ప్రక్కనే కూర్చుని తనూ ఉత్తరంలోకి చూడసాగేడు. సాధారణంగా ఎప్పుడూ ఇలాగే జరుగుతోంది. నాకొచ్చే ఉత్తరాలన్నీ అతను చదువుతుండేవాడు. అందుకే నేనెప్పుడూ అభ్యంతరం చెప్పలేదు. దానిక్కారణాలున్నయి—

చలపతి నాకు ప్రాణ స్నేహితుడు కాదు. రెణ్ణెల్ల క్రితం వరకు మేమిద్దరం ఒకరికొకరు తెలీదు. నేనా ఆఫీసుకి కాకినాడ నుంచి బదిలీ అయి వచ్చాను. నా ప్రక్క సీటు చలపతిది. అతనూ నాలాగే బ్రహ్మచారి అని తెల్సినప్పుడు ఎంచేతో అతనంటే 'మన' అనే అభిప్రాయం కలిగింది. కొన్ని రోజులవరకూ అతన్ని గురించి ఏమీ పట్టించుకోలేదు కూడా. అతను పది గంటలకల్లా ఆఫీసుకొచ్చి సీట్లో కూలబడేవాడు. సాయంత్రం అయిదున్నర వరకూ వంచిన తల ఎత్తేవాడు కాదు. మిగతా గుమాస్తాలతో వాట్లాడాలంటే చాలా భయంగా, ఖంగారుగా మాట్లాడేవాడు. వాళ్ళందరూ అతని గురించి 'జోక్స్' వేసుకోడం, హేళనగా మాట్లాడడం, అతనిని ఆటలు పట్టించడం చూసి అతని అమాయకత్వంమీద జాలి కలిగిందినాకు. ఎవ్వరేమన్నా చలపతి మాట్లాడేవాడుకాదు. నవ్వి ఊరుకొనేవాడు. అతనివేషం కూడా చాలా విచిత్రంగా వుండేది. మోకాళ్ళవరకూ వ్రేలాడుతూండే చొక్కా, క్రింద మడతదగ్గర చిరిగిపోయిన పాంట్లు తొడుగుతూండేవాడు.

'చలపతీ! షర్టు చాలా బాగాకుట్టాడే! ఎక్కడ కుట్టించావ్?...' కొంతమంది అనేవాళ్ళు నవ్వుతూ. వాళ్ళు తన దుస్తుల్ని వెక్కిరిస్తున్నారని తెలియకకాబోలు ఫలానా చోట కుట్టించానని చెప్పేవాడు మందహాసంలో.

ఇద్దరం ఒకటే హోటల్లో భోజనం

చేసే వాళ్లం.. చాలా కొద్దిరోజుల్లోనే చలపతి నాకు చాలా ఆత్మీయుడయ్యాడు. బహుశా అతనిమీద నాక్కలిగిన జాలి అందుకు కారణమనుకొంటాను ఫలితంగా అతనూ నేనూ రూమ్మేట్సయ్యేం. అప్పుడే అతన్ని చాలదగ్గరగా పరిశీలించే అవకాశం కలిగింది. అతనిలో ఏదో విషాదం గూడు కట్టుకొని ఉంది. అతనిమాటల్లో ఏదో దిగులు ఆవేదన ప్రతిధ్వనిస్తూండేవి అతనిని హేళనచేసి, అతని దుస్థితిచూసి పళ్లికిలించే వాళ్లందరినీ 'షూట్' చేద్దామన్నంత కోపం వచ్చేది. నాకు కష్టాలుతెలుసు. నాకే కాదు. ఆఫీసులో చలపతిని ఎద్దేవాచేసే ప్రతివెధవకీ తెలుసు. అవి తెలియందే ఇలాంటి ఉద్యోగాలు చేయలేరు. కానీ ఇప్పుడు వాటిని మర్చిపోయి, కనీసం లలానటించి ఇంకా వాటినీడ క్రిందే బ్రతుకుతూన్న 'చలపతి'ని తమ సరసానికి టాపిక్‌గా వాడుకొంటున్నారు నవ్వుకోవా లంటే ఎన్నిమార్గాల్లేవు? సినిమాచూసి నవ్వుకోవచ్చు. ఇంటిదగ్గర చిన్నపిల్లలతో ఆటలాడి నవ్వుకోవచ్చు అంతేకాని చలపతినిచూసి నవ్వటం నేను సహించలేను. అందుకే చలపతికి బాగా దగ్గరయ్యాను. ఇప్పుడు చలపతి నాప్రాణం. మిగతావాళ్లకూ నాకూ బోలెడుదూరం. ఆదూరం ఎంత పెరిగితే నాకంత మనశ్శాంతి. మానవత్వం లేని మనుష్యులంటే నాకు అసహ్యం.

చలపతి తనగురించి చెప్పేడు. తల్లిని అతను చూడలేదు. తండ్రి విపరీతమయిన త్రాగుడుకి అలవాటుపడి ఓ ప్రమాదంలో మరణించాడు. అప్పుడు చలపతి ఫిఫ్త్‌ఫారం చదువుతున్నాడు. అతన్ని అభిమానించే కొంతమంది టీచర్లు అతనికి వారాలు ఏర్పాటుచేసి చందాలువేసుకొని యస్సెల్సీ పరీక్ష వ్రాయించేరు పరీక్షపాసయి, ఉద్యోగం దొరికేవరకూ అతనుపడిన బాధలు చలపతి చెప్పలేకపోయాడు. అప్పుడతని కళ్లవెంబడి నీరుకారింది. నోటమాట రాలేదు. చాలాసేపు చలనం లేకుండా కూర్చుండిపోయాడు. అతని కన్నీళ్ల వెనుక చలపతిపడ్డ బాధలు స్పష్టంగా నాకు కనిపించినయి.

'నేను ఏకాకిగాణ్ణండీ! నాకెవ్వరూలేరు. కనీసం మంచి స్నేహితుల్ని సంపాదించుకొనే తెలివికూడా భగవంతుడు నాకివ్వలేదు. అందరితో మాట్లాడాలని, అందరిలో కలసి పోవాలనీ నాకుంటుంది. కాని ... కాని నన్నెవ్వరూ దగ్గరికి రానీరు.' అందరూ నన్ను అవమానిస్తారు. నన్ను చూసి నవ్వు కొంటారు...' చాలా ఆవేశంగా మాట్లాడాడు చలపతి—

అక్కయ్య వ్రాసిన ఉత్తరం నాతో బాటు తనూ చదివేడు.

ప్రియమయిన తమ్ముడికి మీ అక్క దీవించి వ్రాయునది,

ఇక్కడ మేమందరం క్షేమంగా ఉన్నాము. నీదగ్గర్నుంచి ఈ మధ్య ఉత్తరాల్లేవు. నిన్ను చూసి కూడా చాలా రోజు లయింది. మొన్నరాత్రి కలలో కనిపించేవు. నిన్నంతా నీదే ఆలాపన. అన్నం కూడా సరిగ్గా తినబుద్ధి కాలేదు. వెంటనే కొన్నాళ్లు సెలవు పెట్టి ఇక్కడకు వచ్చెయ్...'

ఉత్తరం బల్లమీదకు గిరాటేసి చలపతి వంక చూశాను. ఏదో ఆలోచిస్తూ కిటికీలో నుంచి బయటకు చూస్తున్నాడు. అతని మనసులోని ఆలోచనలని ఊహించాను. తనని రమ్మని పిలిచే అప్పు లెవరున్నారు? తలచేవారే లేరు. తన క్షేమం గురించి ఎవ్వరికీ ఆదుర్దాలేదు. తను ఉత్తరాలు వ్రాసేందు కెవ్వరూలేరు. తనని గురించి ఎవ్వరూ కలలు కనరు. తను ఏకాకిగాడు. మనిషిలా నటిస్తున్న ఓ మెషిన్.... ఇవే ఆలోచిస్తూండి ఉంటా డతను. కుర్చీలో నుంచి లేచి నుంచున్నాను. చలపతి ఇంకా ఆలోచనల్లోంచి తేరుకో లేదు.

'చలపతీ!' అంటూ అతని భుజాన్ని కుదిపాను.

ఉలిక్కిపడి నా వంక చూశాడు.

'ఏమిటి తదేకంగా చూస్తున్నారు?...'

'అటు చూడండి!...' అంటూ బయటకు చూపించాడు. అటువేపు చూశాను. ఓ పది గజాల దూరంలో గానుగ చెట్టు కొమ్మమీద, గూడులో నుంచి బయటి కొచ్చి ఓ పిల్లకాకి కంగారుగా అరిచేస్తోంది. అందులో ఏం విశేషం ఉందో అర్థం కాలేదు.

'తల్లికాకి కోసం అరుస్తోందిసార్!' అన్నాడు అటే చూస్తూ.

'పాపం! విన్నట్టున్నుంచీ ఆలానే అరుస్తోందండీ! దాని తల్లి ఎటు పోయిందో అంతులేదు. తిండి కూడా లేదు దానికి. ఎలా తూలిపోతోందో చూడండి!' ఎందుకో కాకి పిల్లమీద కంటె చలపతి మీదే ఎక్కువ జాలి కలిగింది నాకు. కొద్ది నిముషాల తర్వాత హఠాత్తుగా అడిగాడు.

'మీ రత్న వ్రాసిన ఉత్తరం ఏది? చదవండిసార్! వింటాను...' చాలా ఉత్సాహంగా కనిపించినయి అతని కళ్లు.

ఒకరి ఉత్తరాలు మరొకరు చదువ కూడదని నాకు తెలుసు. బహుశా చలపతి క్కూడా తెలుసేమో నాకు తెలియదు. ఇంత వరకూ అతను నా ఉత్తరాలన్నీ చదువుతూ వచ్చాడు. కనీసం రత్న వ్రాసే ఉత్తరాలు అతను చదువకుండాఉంటే బాగుండునని నాకనిపించేది. కాని అలా అని ఎప్పుడూ పైకనలేదు ఆ అభ్యంతరం అతన్ని గాయ పరుస్తుందేమోనని అనుమానం. కాని వారంరోజుల క్రితం రత్న వ్రాసిన ఉత్తరం చదివింతర్వాత ఆ సాహసం చేయక తప్పదని నిర్ణయించుకొన్నాను.

'నేను వ్రాసిన ఉత్తరం మీ స్నేహితుడు కూడా చదివి పదేపదే నవ్వాడని వ్రాశారు. నాకు చాలా ఆశ్చర్యం కలిగింది, మన ఉత్తరాలు మీ స్నేహితుడు చదవడం ఏమిటి? అతని క్కామన్‌సెన్స్' లేదని నేననుకోను మన ఉత్తరాలు మరొకరు (మనిద్దరికీ ఎంత ఆత్మీయు లయినా సరే) చదవడం నా కిష్టంలేదు. అందులోని విషయాలు మనమధ్యనే వుండాలి. ఇకనుంచయినా మీ స్నేహితుని అలవాటు మాన్పించండి. ఈ ఉత్తరంకూడా చదివితే బహుశా అతనే మానేస్తాడు......' రత్న వ్రాసిన ఉత్తరంలోని సారాంశం ఇది. ఆ ఉత్తరం చలపతికి అందకుండా జాగ్రత్త పడ్డాను.

'ఉత్తరాలంటే అంత పిచ్చి ఉండకూడ దోయ్!' అన్నాను నవ్వుతూ.

'అవునండి! ఏమిటో! నాకు భలే పిచ్చి... ఇంతకీ మీరా ఉత్తరం చదువ రేమిటివాళ ?...'

మొదటిసారిగా అతనిమీద కోపంవచ్చింది. ఎలా ఇతనికి చెప్పటం ?.

'చలపతి ! నాడైరీ ఎప్పుడేనా చది వావా ?'

అతను ఆశ్చర్యంగా నావంక చూశాడు,

'అదేంటండీ! ఒకళ్ళడైరీ మరొకరు చదువగూడదు సార్! అది నా ప్రిన్సిపుల్' ఈ సారి నేను ఆశ్చర్యపోయాను. మరి ఉత్తరాలుకూడా ఇద్దరు కలిసి వ్రాసుకొనే డైరీ లాంటివని ఇతనికి తెలీదా? అదే అడుగుదా మనుకొన్నాను కానీ ధైర్యం చాలటంలేదు. అతని సంగతి నాకు బాగా తెలుసు. ఆశలులేకుండా బ్రతుకుతున్న మనిషతను. 'సుఖం' కోసం అతను కలలు కనడంలేదు. ఒంటరితనాన్ని మర్చిపోడానికి అతను విశ్వప్రయత్నం చేస్తున్నాడు. నా కొచ్చే ఉత్తరాలు చదవడం అతని కొంత మనశ్శాంతి నిస్తుంది. అందు మూలాన నా కొచ్చే నష్టంకూడా ఏమీ లేదు. అతనికి నా ఉత్తరాలిచ్చే స్వల్పానందం దాన్ని దూరం చేయడానికి మనసొప్పడం లేదు. నేనూ అతనిలాంటి మనిషిని. కాని భగవంతుడు అతనికంటె కొన్ని అదనపు వరాలిచ్చేడు నాకు. 'నా' అనేవాళ్ళు బోలెడు మంది ఉన్నారు నాకు. నా తీయని కోరికలకి రూపాన్నిచ్చే దేవత 'రత్న' నాకోసం ఉంది. అందుకే ఇవేమీ లేని చలపతిని చూస్తే జాలి. అతనికి చేయూతనివ్వడం నాకానందం.

'నేను ఉత్తరం చదువుదామంటే మీరు డైరీగురించి మాట్లాడతారేమిటండీ? పోనీ లెండి! మీరు తర్వాత తిరిగ్గా చదువు కోండి. నేను ముందు చదివేస్తాను...'

టేబిల్‌మీద ఉత్తరం అందుకొన్నాడతను. ఏంచేయాలో పాలుపోవడంలేదు నాకు. అతని ప్రయత్నాన్ని ఆపాలి.

కవరు చింపాడు చలపతి.

'చలపతీ!' నాగొంతులో తీవ్రత నాకే ఆశ్చర్యం కలిగించింది.

ఇంచుమించుగా బెంగరుతో నావంక చూశాడతను.

'ఏమిటండీ?'

అంతకుముందు రత్న వ్రాసిన ఉత్తరం అల్మైరాలోనుంచి తీసి అతనికిచ్చాను.

'ఈ ఉత్తరం వారంరోజులక్రితం రత్న వ్రాసింది. నీకిది చూపించలేదు ముందిది చదువు...'

అతను నావంక ఓసారి విచిత్రంగా చూసి ఉత్తరం చదివాడు క్రమేపీ అతని మొఖంలో రంగులు మారినయి. ఆఖరికొచ్చే సరి అతనిమొఖం పాలిపోయింది. తలెత్తి నావంక చూడలేకపోయాడు. చేతిలోని రెండు ఉత్తరాలూ టేబుల్ మీదుంచేడు.

'సారీ! సారీసర్; నాకుతెలుసు! పొరబాటే...' అతని కళ్ళవెంబడి బొటబొట కన్నీళ్ళు కారినయి.


'ఇప్పుడతన్ని ఎలా తట్టుకోవాలో నాకు బొత్తిగా తెలీదు. ఇలాంటి పరిస్థితి రాకుండా ఉంటానికే ఇన్నాళ్ళూ ప్రయత్నిస్తూ వచ్చాను. నా దగ్గరగావచ్చి నుంచున్నాడతను.

'నాకుతెలుసండీ! ఒకళ్ళ ఉత్తరాలు చదువకూడదని! ...కాని...కాని ఏంచేయను? కొన్ని సంవత్సరాలనుండీ ఈ పాడు ఒంటరితనంతో విసిగిపోయాను. ఇది నన్ను నిర్వంగా వేటాడుతోంది...' అతని గొంతు బొంగురు పోయింది.

'...ఆఫీసులో సంగతి మీకు తెలుసు. నన్ను ఓ 'బఫూన్'ని చేసి వాళ్ళందరూ ఆడుకొంటున్నారు. నేను ఏడుస్తుంటే వాళ్ళు నవ్వుకొంటున్నారు. నేనూ ఆ రకమయిన జీవితానికి అలవాటు పడ్డాను. నేనలా ఉండిపోయినా బాగుండేది. కాని మీరు వచ్చి నన్ను మళ్ళీ మనిషిని చేశారు. నేను ఏకాకిగాణ్ణి కాదని చాటి చెప్పేరు. ఆశ న్సార్! ఆ పేమగుల వాళ్ళు పడిపోయినయి. ఎవడయినా ఒక్క పెధవ నాగురించి నోరెత్తాడా వాణ్ణి చీల్చి చెండాడేయగల ధైర్యం ఇప్పుడు నాకుంది...'

కొంచెం ఆగా డతను.

'...నా కెవ్వరూ ఉత్తరాలు వ్రాయ డానికి లేరుసార్! నా గురించి దుఃఖం, సంతోషం పంచుకొనేందు కెవ్వరూ లేరు. ఊహ తెలిసిం దగ్గర్నుంచీ ఒక్కఉత్తరం, గూడా రాలేదు. నిజంసార్! ఆఫీసులో అందరికీ ఉత్తరాలొస్తాండేయి. ఆ పోస్ట్‌మన్‌కూడా నిరంజనంగాడి మాటలు విని నా వంకచూసి హేళనగా నవ్వి వెళ్తాండేవాడు. నా కెప్పుడూ ఉత్తరాలు రావని వాడిధైర్యం. అందుకే...సుసరూపెకే మీ ఉత్తరాలు వాడు తెచ్చినప్పుడు నేనే మీ కంటె ముందుకెళ్ళి ఆ ఉత్తరాలు అందుకొని తెచ్చేవాణ్ణి. కాని వాటిని చూస్తూంటే చదవాలనే కోరిక నన్ను లాగేది. అంతవరకూ నేను ఉత్తరాలు చదువ లేదు. చిన్నప్పుడు ఆత్రం కొద్దీ ఓసారి మా హెడ్మాష్టరుగారి కొచ్చిన ఉత్తరం దొంగిలించి చాటుగా చదువుతోంటే పట్టుబడి వాపుదెబ్బలు తిన్నాను. అప్పట్నుంచీ నన్ను తొలుస్తూ లోపల ఆ కోరిక అలానే ఉండిపోయింది. అక్కయ్య వ్రాసినఉత్తరం చదివి అందులో నేనూ ఓ అక్కయ్యకి రూపు దిద్దుకొనే వాణ్ణి. మీ అమ్మగారు వ్రాసిన ఉత్తరం చదివి నా తల్లిని ఊహించుకొనే వాడిని. రత్న మీకు వ్రాసే ఉత్తరాలు చూసి ఎప్పటికయినా నన్నూ ఓ అమ్మాయి ప్రేమిస్తే, ఆ అమ్మాయి



ఇంత తీయని ఉత్తరాలు వ్రాస్తుందని కలలు కన్నాను. ఇంతేనండి!...చదువకూడదని తెలిసీ — పాడు కోరికకి లొంగిపోయి 'స్నేహం' అవధులుదాటేను. తప్పుచేశాను. ఇంకెన్నడూ అలా ప్రవర్తించనని మాట ఇస్తున్నాను. నన్ను దూరం చేయకండి! రత్నకి వ్రాయండి.

'చలపతిగాడు వట్టి ఫూల్! ఆ వెధవకి 'కామన్‌సెన్స్' లేదు. మేనర్స్ తెలీదు. ఇప్పుడు వాడికి జ్ఞానోదయ మయింది. ఇంక వాడు ఏ ఉత్తరాలు చదువడు, ప్లీజ్ ఫర్గివ్ దట్ క్రీచర్! అనాశయుండి సార్...' నాకూ కళ్ళవెంబడి నీళ్ళు తిరిగినయి.

'చలపతీ! ప్లీజ్! జరిగింది మర్చిపో! ఇంకొక్కమాట కూడా దీన్నిగురించి మాట్లాడొద్దు...'

ఏదో నిస్పృత్యననన్నా సహించింది. కుర్చీలో కూలబడ్డాను. చాలాసేపు నిశ్శబ్దం అలుముకొంది... టైము ఒంటిగంటయింది.

'పదండి సార్! భోజనానికి వెడదాం!' కళ్ళు తుడుచుకొని అన్నాడు చలపతి,

'ఊహూ! ఆకలి లేదు చలపతీ! నువ్వెళ్ళిరా!' మరోమాట లేకుండా బయటకి నడిచేడతను. ఎండనిప్పులు చెరుగుతోంది. అతను తలవంచుకొని నడుస్తున్నాడు, అతని మొఖంలో ఏదో నేరం చేసినవాడిలా వ్యథ తొంగి చూస్తోంది. అతను గాయపడ్డాడు. నాకుతెలుసు. నా ఎదుటే తిరుగుతూ అతను కోలుకోలేడు వెంటనే బదిలీ చేయించుకొని అతనికి దూరంగా వెళ్ళిపోవాలి. అతనికి దూరమయి చేయగలిగే సహాయం ఒకటుంది. అతనికి ఎప్పుడూ ఉత్తరాలు వ్రాస్తూంటాను. అతను అందరిలా బ్రతకడానికి అవి 'ఊపిరి'లా పనిచేస్తాయి. సారీ! సారీ చలపతీ! నీమీద విపరీతమయిన సింపతీ చూపించి, గొప్ప ప్రేమ త్యాగాలు కురిపించేయా లనుకొన్నాను. కాని నాకు అప్పుడు తెలియలేదు. నేనూ అందరిలాంటి మనిషినే నని, నాకూ ఓ పరిధి వుంటుందనీ, అందులోకి మరొకరు రావడం సహించలేనని! అందుకు నువ్వే నన్ను క్షమించాలి...' ●


# నొప్పిని త్వరగా తొలగించడానికి మాత్రమే 'ఆస్ప్రో' మైక్రోఫైన్‌డ్ కాబడినది

క్రొత్త మైక్రోఫైన్‌డ్ 'ఆస్ప్రో' ఈ విధంగా పనిచేస్తుంది.







బిళ్ళలోని అణువు ఎంత పెద్దదిగా వుంటే అంత నెమ్మదిగాను అది ఇముడుతుంది.. అందువల్ల మీరు, నొప్పి తగ్గడానికి చాలాసేపు ఆగాలి.

ఇది మైక్రోఫైన్‌డ్ చెయ్యబడుట వలన, ప్రతి, క్రొత్త మైక్రోఫైన్‌డ్ 'ఆస్ప్రో' బిళ్ళలోను ఇంచుమించు 15 కోట్లు అతి సూక్ష్మమైన అణువులు వుంటాయి. ఇందువలన, అది అతి త్వరగా ఇమిడి, అతి శీఘ్రంగా నివారణ నిచ్చును.

వీటి కోసం క్రొత్త మైక్రోఫైన్‌డ్ 'ఆస్ప్రో'ను వాడండి: నొప్పి • తల నొప్పి • ఒళ్ళు నొప్పి • ఫ్లూ • జ్వరముతో కూడిన జలుబు • కీళ్ళ నొప్పి • గొంతుక నొప్పి • పంటి పోటు.

క్రొత్త మైక్రోఫైన్‌డ్ 'ఆస్ప్రో' నొప్పిని నివారించుటకు, ఇప్పుడు మీకు లభించే వాటిలో అతి ఆధునికమైన సాధనము.




మోతాదు: పెద్దవారికి: రెండు బిళ్ళలు. అవసరమైతే మళ్ళీ వేసుకోండి. పిల్లలకు: ఒక బిళ్ళ. లేక డాక్టర్ వంటివారి ప్రకారము వేసుకొనవలెను.

## క్రొత్త మైక్రోఫైన్‌డ్ 'ఆస్ప్రో'
## అతి శీఘ్రంగా నొప్పిని తొలగించును

నికోలస్ తయారు

A.C. 23-69 TL